Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

PRAJA TELEVISION
The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో.. ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు. నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..

సంప్రదించండి: 8309979541, 9494659622

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 సంచిక : 252 హైదరాబాద్ ఆదివారం 26 జూలై 2026 పేజీలు : 8 వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ఆందోళనల విరమణ

నిరసనలు ఆపేస్తున్నట్లు ప్రకటించిన సీజేపీ

డిమాండ్లకు ప్రభుత్వం ఒప్పుకుందని ప్రకటన

మంత్రులతో ఫలవంతమైన చర్చల తర్వాత

సీజేపీ సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక పోటీపరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంతో ఉద్యమించిన యువత ఆరంభించిన ఆందోళనలను విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార?ట(సీజేపీ) శనివారం ప్రకటించింది. నీట్ ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో పాటు ఆత్మహత్యలకు పాల్పడిన పరీక్షార్థుల కుటుంబాలకు తలో రూ.1 కోటి నష్టపరిహారం, జూన్ 20నాటి ఛలో సంసద్ ర్యాలీలో పోలీసులతో ప్రతిఘటించిన ఉద్యమకారులపై మోపిన కేసులన్నింటినీ ఎత్తేసేందుకు మోదీ సర్కార్ సమ్మతి తెలపడంతో తమ ఆందోళనలను విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రభుత్వంతో జరిపిన నాలుగో దఫా చర్చలు

- మిగతా 2వ పేజీలో



# సరికొత్త దిక్సూచి జెన్‌జీ!

## సంచలనం సృష్టించిన కాక్రోచ్.. దేశచరిత్రలో మోదీతో తొలిసారి ఢీ

- వెనక్కి తగ్గేలా చేసిన యువత
- జెండాలు.. పార్టీలతో సంబంధం లేకుండా ముందడుగు
- సాంప్రదాయ పోరాటానికి భిన్నంగా ఉద్యమం
- అండగా సోషల్‌మీడియా..

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

బలవంతుడ నాకేమని పలువురితో నిగ్రహించి పలుకుట మేలా?
బలవంతమైన సర్పము చలిచీమల చేత జిక్కి చావదే సుమతీ!

సుమతీ శతకంలోని ఈ పద్యం అక్షరాల నిజమైంది. కాక్రోచ్ జనతా పార్టీతో కలిసి జెన్‌జీ యువత దేశ చరిత్రలో తొలిసారిగా ఎలాంటి రాజకీయ జెండాలు, అనుబంధ గుర్తులు లేకుండా కేవలం తమ భవిష్యత్తు కోసం సాగించిన పోరాటం.. విజయం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. పార్టీలు, బడాబడా నాయకులమని చెప్పుకునేవారు సైతం సాధించని రీతిలో తిరుగేలేదని భావిస్తున్న కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వెనకడుగు వేసేలా చేసింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సాధించుకోవడం జెన్‌జీ చేసిన తొలి పోరాటానికి లభించిన అతిపెద్ద విజయం.

**రాజకీయ రచ్చ లేకుండా..**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలు, పేపర్ లీకేజీల రచ్చతో విసిగిపోయిన విద్యార్థులు ఈసారి సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతల మాటలను నమ్మలేదు. ప్రతిపక్షాలు ఈ సమస్యను తమ రాజకీయ లబ్ధికి వాడుకోవాలని చూసిన ప్రతిసారి జెన్జీలు వారిని దూరంగా ఉంచారు. ఇది మా భవిష్యత్తు పోరాటం.. మీ రాజకీయ రచ్చ ఇక్కడ వద్దు అని తెగేసి చెప్పారు. రాజకీయ అజెండాలకు అతీతంగా, కేవలం పారదర్శకత, జవాబుదారీతనం డిమాండ్‌తో సాగించిన ఈ నాన్–పొలిటికల్ మూవ్‌మెంట్ ముందు కేంద్ర యంత్రాంగానికి

- మిగతా 2వ పేజీలో



## యువతకు గొప్ప విజయం

### మాజీ మంత్రి హరీశ్

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత సాధించిన గొప్ప విజయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. దేశంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని స్పష్టం చేశారు. ఈ విజయాన్ని సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు అంటూ ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. యువత సంకల్పం, ఐక్యత ఫలితమే ఈ విజయం అని తెలిపారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తోందని, వారి స్వరం మరింత బలంగా విని పిస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సోలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ రికార్డులు పరిశీలించిన ఆయన, గతంలో రైతులకు 14–15గంటల విద్యుత్ అందించగా ఇప్పుడు 12గంటలే ఇస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ వ్యవస్థను కూడా ప్రభుత్వం సరిగా నిర్వహించలేక పోతోందన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



## దేశ విద్యావ్యవస్థ.. ఆర్ఎస్ఎస్ చెరలో!

విద్యార్థులపై పెల్లెట్ గన్ల ప్రయోగానికి అమిత్‌షాదే బాధ్యత

ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం

మోదీ సర్కార్‌కు ఇది మేల్కొలుపు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ

ఢిల్లీ, జూలై 25 (విజయక్రాంతి): మన విద్యా వ్యవస్థ ఎంతో గొప్పదని ప్రపంచమంతా పేరున్నా.. కొన్నేళ్లుగా అది దాడు లకు గురవుతోందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. రాష్ట్రీ య స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) దొడ్డిదారిన చొరబడి విద్యా వ్యవస్థను చెరబట్టి నాశనం చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. ఇందులో ప్రధాని మోదీ తప్పు ఎంత ఉందో ఆర్ఎస్ఎస్ పాత్ర కూడా అంతే

- మిగతా 2వ పేజీలో

# కాక్రోచ్ గెలిచింది

## ప్రధాన్ రాజీనామా.. ఆందోళన విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

- నిరసనకారులపై కేసులు ఎత్తివేస్తామన్న జేపీ నడ్డా
- జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ సంబరాలు
- భయపడకపోతే విజయం సులభమేనన్న అభిజీత్ దీప్కే
- విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ నేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ డిమాండ్
- ఇది ప్రజాస్వామ్య విజయమన్న సోనమ్ వాంగ్‌చుక్
- ప్రల్హాద్ జోషీకి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు

కేంద్రం, సీజేపీ చర్చలు సఫలం



న్యూఢిల్లీ: బొద్దింకే కదా అని తేలిగ్గా తీసిపారేయడానికి వీల్లేదని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరూపించింది. నీట్––యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువతరాన్ని ఉద్యమం వైపు మళ్లించి అనుకున్నది సాధించింది. సీజేపీ పోరాటంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు. గత పది రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాల పట్ల కలత చెందానని ఆయన చెప్పారు. యువత

- మిగతా 2వ పేజీలో



## నేటితరం దారి తప్పలేదు

కొత్త తరానికి జవాబు ఇవ్వాల్సిందే

యువత ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోంది

వారికి సమాధానంచెప్పాల్సిందే

కొత్త సాంకేతికతపై పట్టు సాధించాలి

తల్లిదండ్రులు మరింత ఆప్యాయంగా ఉండాలి

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

-2లో



## బీజేపీ పతనానికి తొలిమెట్టు

### మంత్రి పొన్నం ప్రభాకర్

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా మా విద్యార్థులు, ఉద్యమకారుల విజయం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది అప్రజాస్వామ్యం మీద గెలుపు అని వ్యాఖ్యానించారు. ఈ రోజు దిగి వచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగడం కూడా తప్పదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ పోరాటం, విద్యార్థుల పోరాటం, దేశవ్యాప్తంగా ఐక్యతతో కేంద్రం దిగివచ్చిందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థుల జీవి తాలతో చెలగాటం ఆడవద్దనే గుణపాఠం ప్రభు త్వానికి వచ్చిందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బీజేపీ ప్రభు త్వ పతనానికి తొలిమెట్టు అని అన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక ఉద్యమాల్లో తప్పకుండా కలిసి పోరాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.




-2లో

## ఈ సునామీ ఇంతటితో ఆగొద్దు!

### యువత గళం జంతర్‌మంతర్ నుంచి లోక్‌సభలో వినిపించాలి

ఇందుకోసం 25 ఏళ్ల వరకు ఆగాల్సిన అవసరం లేదు

21 ఏళ్లకే లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రవేశం కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తాం

మీ పోరాటంతోనే మోదీ తలవంచారు.. విద్యార్థి సంఘీభావ ర్యాలీలో సీఎం రేవంత్

పీసీసీ అధ్యక్షుడి విజ్ఞప్తి మేరకు 21 ఏళ్లకే చట్టసభల తీర్మానంపై సీఎం ప్రకటన

# సరికొత్త దిక్సూచి జెన్‌జీ!

(మొదటి పేజీ తరువాయి)

ఏం చేయాలో పాలుపోలేదు. పార్టీల రంగులు పూసి ఆందోళనలను దిగజార్చే అవకాశం లేకపోవడమే ఈ ఉద్యమానికి అతిపెద్ద బలమైంది.

### విభిన్న శైలిలో ఉద్యమం

సాంప్రదాయ పోరాట శైలికి భిన్నంగా జెన్జీలు అవలంబించిన డిజిటల్ ప్లస్ ఫీల్డ్ స్ట్రాటజీ ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. ఒకవైపు సోషల్ మీడియా వేదికలైన ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లక్షలాది హాష్‌ట్యాగ్‌లతో అంతర్జాతీయ స్థాయిలో కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే.. మరోవైపు ఢిల్లీ వీధుల్లో ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుత నిరసనలు చేపట్టారు. హుందాతనంతో కూడిన నిరసనలు, ఖచ్చితమైన సమాచారంతో కూడిన ప్రశ్నావళితో కేంద్ర మంత్రులను, అధికారులను నిలదీశారు. లాఠీఛార్జీలు చేసినా ఎదుర్కొన్నారు. కానీ అది విధ్వంసం వైపు వెళ్లనీయలేదు. ప్రజాస్వామ్యయుత తీవ్ర నిరసనతోనే ఢిల్లీ పీఠాన్ని కదిలించారు.

### వేలాది మంది వీధుల్లోకి..

రాజకీయ పార్టీలకు సాధ్యం కానిది జెన్జీలు ఎలా సాధించారంటే.. అందులో నైతిక బలం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక ప్రతిపక్ష పార్టీ ధర్నా చేస్తే దానికి ఎన్నికల స్టంట్ అనే ముద్ర వేసి కొట్టిపారేయడం ప్రభుత్వాలకు తేలిక. కానీ, స్వచ్ఛమైన మనస్సులతో తమ కష్టానికి ప్రతిఫలం కోరుతూ వీధిలోకి వచ్చిన లక్షలాది మంది అభ్యర్థుల ఆవేదనను ఏ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయలేదు. పైగా, రాబోయే రోజుల్లో దేశంలోనే అతిపెద్ద ఓటు బ్యాంకుగా మారబోతున్న ఈ జెన్జీ ఓటర్ల ఆగ్రహానికి గురైతే కలిగే నష్టం తీవ్రంగా ఉంటుందని కేంద్ర బిజెపి అధిష్టానం ముందే గ్రహించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేవలం ఒక వ్యక్తి పదవిని కోల్పోవడం కాదు. అది వ్యవస్థల పారదర్శకతపై సాధించిన విజయం. ప్రభుత్వాలు ఎంతటి మేజారిటీతో ఉన్నా, యువత , పౌర సమాజం ఒకే లక్ష్యంతో నిలబడితే దిగిరాక తప్పదనే సందేశాన్ని కాక్రోచ్ జనతా పార్టీ పోరాటం అందించింది. గతంలో రైతులు సాధించిన విజయం ఒక ఎత్తయితే, డిజిటల్ యుగంలో పెరిగిన జెన్జీలు సాంకేతికతను, ప్రజాస్వామ్య హక్కులను మేళవించి సాధించిన ఈ విజయం భారత రాజకీయ భవిష్యత్తుకు ఒక సరికొత్త దిక్సూచిగా నిలిచింది. తొలి ప్రయత్నంలోనే ప్రభంజనం సృష్టించిన జెన్జీ మూవ్‌మెంట్, రాబోయే రోజుల్లో దేశంలో ఏ ప్రభుత్వం ఉన్నా సరే.. విధానపరమైన నిర్ణయాల్లో పారదర్శకత లేకపోతే యువత ఎలాంటి దెబ్బ తీయగలదో ప్రత్యక్షంగా చూపించింది. రాజకీయాల్లో జెండాల కంటే, నినాదాల కంటే.. న్యాయం, బాధ్యత అనే ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలే గెలుస్తాయని ఈ చారిత్రాత్మక ఘట్టం స్పష్టం చేసింది.

## ఈ సునామీ ఇంతటితో ఆగొద్దు!

### యువత గళం జంతర్‌మంతర్ నుంచి లోక్‌సభలో వినిపించాలి

- ఇందుకోసం 25 ఏళ్ల వరకు ఆగాల్సిన అవసరం లేదు
- 21 ఏళ్లకే లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రవేశం కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- మీ పోరాటంతోనే మోదీ తలవంచారు.. విద్యార్థి సంఘీభావ ర్యాలీలో సీఎం రేవంత్

యువత గళం జంతర్‌మంతర్ నుంచి లోక్‌సభలో వినిపించాలి.. ఇందుకోసం 25 ఏళ్ల వరకు ఆగాల్సిన అవసరం లేదు 21 ఏళ్లకే లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రవేశం కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తాం 'రోడ్లపై జరిగిన మీ పోరాటం మళ్లీ ఇంటికి వెళ్లొద్దు. జంతర్‌మంతర్ నుంచి నేరుగా లోక్‌సభ, రాజ్యసభకు వెళ్లాలి. ఈ సునామీ ఇంతటితో ఆగొద్దు. ఇక్కడ వినిపించిన గళం చట్టసభల్లో ప్రవేశించాలి. మీ ఆలోచన ప్రపంచానికి చాటిచెప్పాలి. నాడు రాజీవ్‌గాంధీ హయాంలో రాజ్యాంగాన్ని సవరించి 18 ఏళ్లకే దేశ యువతకు ఓటు హక్కు కల్పించారు. 21 ఏళ్లకే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతున్నారు. కానీ, ఈ దేశ యువత లోక్‌సభకు, అసెంబ్లీకి వెళ్లాలంటే 25 ఏళ్ల వరకు, రాజ్యసభకు, శాసనమండలికి వెళ్లాలంటే 30 ఏళ్ల వరకు నిరీక్షించాల్సి వస్తోంది. అందుకే దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం తెలంగాణ నుంచే ప్రారంభం కావాలి. ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలిని ప్రత్యేకంగా సమావేశపరుస్తా. 21 ఏళ్లకే చట్టసభల్లోకి ప్రవేశం కల్పించేలా అన్ని పక్షాలతో చర్చించి రాష్ట్రం తరఫున తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. రాహుల్, ఖర్గే సహకారంతో పార్లమెంటులో ఆమోదానికి ప్రయత్నిస్తాం'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈసారి రాహుల్ గాంధీ ప్రధాని అయితే జెన్‌జీ నాయకుడికి కేంద్ర విద్యా శాఖ మంత్రిగా అవకాశం వస్తుందని, అలా ఇప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని, ఇండియా కూటమి పక్షాలతో మాట్లాడి ఒప్పిస్తానని చెప్పారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండిస్తూ, విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా టీపీసీసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి, అజహరుద్దీన్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ నేత పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్‌తో పాటు పలువురు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందిరాగాంధీ విగ్రహం వద్ద యువతనుద్దేశించి సీఎం రేవంత్ మాట్లాడుతూ.. లాఠీలు, తూటాలు విద్యార్థి ఉద్యమ స్ఫూర్తిని నిలువరించలేకపోయాయని, ప్రధాని మోదీని ఓడించి ధర్మేంద్ర ప్రదాన్ చేత రాజీనామా చేయించిన విద్యార్థుల పోరాట స్ఫూర్తిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. 56 అడుగుల చాతీ సాగిలపడిందని ఎద్దేవా చేశారు. సోమవారంలోపు విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇక్కడకు వచ్చిన యువకులెవరూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాదని రేవంత్ అన్నారు. పోరాడి దేశ యువత సాధించిన విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో రాసుకోదల్చుకోలేదన్నారు. ఈ పోరాటం, విజయం యువతదే అని చెప్పారు.

### 21 ఏళ్లకే ప్రధాని కావచ్చు

'శాసనసభతోపాటు లోక్‌సభ, స్థానిక సంస్థలు చట్టసభల్లో ప్రధానమైనవి. ఈ స్థానిక సంస్థల్లో 21 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతకు జిల్లా పరిషత్ చైర్మన్లు, మేయర్లుగా అవకాశం వస్తోంది. తెలుగు అమ్మాయి శ్రీలక్ష్మి నాడు 21 సంవత్సరాలకే ఐఏఎస్ సాధించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డి. అనన్య అనే అమ్మాయి 21 ఏళ్లకే ఐఏఎస్ అయింది. 32 ఏళ్ల క్రితం తన 22 సంవత్సరాల వయసులోనే డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ అయ్యారు. కానీ, అసెంబ్లీ, లోక్‌సభకు వెళ్లాలంటే 25 ఏళ్ల వరకు, రాజ్యసభ, శాసనమండలికి వెళ్లాలంటే 30 ఏళ్ల వరకు ఆగాల్సి వస్తోంది. జర్మనీ, గ్రేట్ బ్రిటన్ లాంటి దేశాల్లో 18 ఏళ్లు పూర్తయితే చట్టసభలకు వెళ్లడమే కాకుండా దేశ ప్రధానులుగా, అధ్యక్షులుగా కూడా కావచ్చు. సింగపూర్‌లో 21 ఏళ్లకే ప్రధాని కావచ్చు. కానీ, మనదేశంలో ఆ పరిస్థితి లేదు. అందుకే 25 ఏళ్ల వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదు. జాతీయ స్థాయిలో విద్యా, ఐటీ శాఖలు 60, 70 ఏళ్లున్న వారు కాదు.. 21 ఏళ్ల వయసున్న యువకులు మంత్రులుగా నిర్వహించాలి. జెన్‌జీ యువ కెరటాలకు చట్టసభల్లో ప్రవేశం కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది. ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలి'అని సీఎం రేవంత్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ 'దేశ వ్యాప్తంగా విద్యార్థి లోకం ఒక్కటైంది. 56 ఇంచుల చాతీ అని చెప్పుకునే ప్రధాని మోదీ నీట్ పరీక్షను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని దుస్థితి దేశంలో ఏర్పడింది. యువతకు చట్టసభల్లో మాట్లాడే అవకాశం వచ్చేంతవరకు ఇలాంటి లీకేజీలు జరుగుతుంటాయి. రాహుల్ ప్రధాని అయితే జెన్‌జీ నుంచి ఒకరు విద్యా మంత్రి అవుతారు. ఉభయసభలను సమావేశపరిచి 21 ఏళ్లకే చట్టసభల్లోకి ప్రవేశించే విధంగా తీర్మానం చేయాలని సీఎం రేవంత్‌ను కోరుతున్నా. దేశ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేసే ఆలోచన తెలంగాణ నుంచే ప్రారంభం కావాలి'అని వ్యాఖ్యానించారు.

# కాక్రోచ్ గెలిచింది

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షలను గౌరవిస్తున్నానని స్పష్టంచేశారు. ఇప్పటి పరిస్థితిని దేశ విద్రోహ శక్తులు అనుకూలంగా మార్చుకోవడానికి అవకాశం ఇవ్వొద్దన్న కారణంతోనే పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు యువతకు ప్రధాన్ లేఖ రాశారు. ఢిల్లీలో పరిణామాలు శనివారం చకచకా జరిగిపోయాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఆయన స్థానంలో కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషీకి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

### కేంద్రం, సీజేపీ చర్చలు సఫలం

మరోవైపు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మధ్య మూడో విడత చర్చలు జరిగాయి. సీజేపీ లేవనెత్తిన మరో రెండు కీలక డిమాండ్ల పట్ల కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించాలని, నిరసనకారులపై కేసులు కొట్టివేయాలని సీజేపీ డిమాండ్ చేయగా, ప్రభుత్వం అందుకు అంగీకారం తెలియజేసింది. మొత్తానికి మూడు కీలకమైన డిమాండ్లు నెరవేరడంతో కాక్రోచ్ జనతా పార?టలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శనివారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత ఆ పార్టీ సంబరాల్లో మునిగిపోయింది. ఆశించిన లక్ష్యం నెరవేరడంతో.. 49 రోజులుగా సాగుతున్న పోరాటాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. నిరసన ప్రదేశాల నుంచి అందరూ శాంతియుతంగా వైదొలగాలని ఆ పార్టీ నేత సౌరవ్ దాస్ కోరారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నడ్డా వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని తెలిపారు. అయితే, ఎంత ఇస్తారన్నది ఆయన పేర్కొనలేదు.

### జంతర్‌మంతర్ వద్ద సంబరాల హోరు

కేంద్ర మంత్రి రాజీనామా చేసిన సంగతి తెలియడంతో జంతర్‌మంతర్ వద్ద శనివారం పండుగ వాతావరణం నెలకొంది. నిరసనకారులు త్రివర్ణ పతాకాలు చేతబూని, కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. 'చక్ దే ఇండియా'వంటి పాటలు వినిపిస్తుండగా, వారు ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం కనిపించింది. చాలామంది డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలను, పోస్టర్లను ప్రదర్శించారు. మంత్రి రాజీనామాను తమ పోరాటానికి దక్కిన విజయంగా అభివర్ణించారు.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే జంతర్‌మంతర్ వద్ద జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనుకున్నది చేసి చూపించామని చెప్పారు. భయపడకపోతే గెలవవచ్చనడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామే నిదర్శనమని స్పష్టంచేశారు. సోనమ్ వాంగ్‌చుక్ సైతం స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయం అని తేల్చిచెప్పారు. సీజేపీకి, దేశంలోని జెన్ జెడ్‌కి అభినందనలు తెలియజేశారు.

### అవినీతికి ప్రతీక ప్రధాన్

ప్రధాని మోదీ మొండితనం ఓడిపోయిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను 'విక్టరీ ఆఫ్ ట్రూత్'గా అభివర్ణించారు. "యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి. లాఠీలు, పెల్లెట్ గన్‌లతో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి"అని ఖర్గే డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన.. ప్రభుత్వాన్ని ఎవరూ తమ సొంత జాగీరులా నడపలేమని బీజేపీ--ఆర్ఎస్ఎస్ పాలకవర్గానికి హెచ్చరిక జారీ చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకవేళ ప్రభుత్వాన్ని సొంత జాగీరుగా భావిస్తే ఇప్పుడు జరిగిన దానికంటే పది రెట్లు తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతికి ప్రతీక అని అని మండిపడ్డారు. ఆయన వెళ్లిపోవడం మంచిదేనని చెప్పారు. ఆందోళన సమయంలో విద్యార్థులపై జరిగిన అకృత్యాలకు గాను ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. "ప్రజాస్వామ్యానికి ఇది గొప్ప విజయం, దేశ ప్రజలందరికీ అభినందనలు"అని ఆమ్ ఆద్మీ పార?ట(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

# నేటితరం దారి తప్పలేదు

- కొత్త తరానికి జవాబు ఇవ్వాల్సిందే
- యువత ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోంది
- వారికి సమాధానంచెప్పాల్సిందే
- కొత్త సాంకేతికతపై పట్టు సాధించాలి
- పిల్లలతో తల్లిదండ్రులు మరింత ఆప్యాయంగా ఉండాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

న్యూఢిల్లీ, జులై 25: నీట్ లీక్ నిరసనల మధ్య ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి తరం దారి తప్పలేదని, కొత్తతరం ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తోందని, జవాబు ఇవ్వాల్సిందేనని, యువతకు సమాధానం చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కొత్తతరంతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడిపి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఇప్పటి తరం మార్గదర్శకత్వం లేనిదో లేదా దారి తప్పినదో కాదని, వారిని అర్థం చేసుకోవడానికి ఆదేశాలు ఇవ్వడం కాకుండా అర్థవంతమైన చర్చలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో విద్యార్థుల నిరసనల వేళ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఢిల్లీలో శనివారం జరిగిన 'విశ్వ మాంగల్య సభ' జాతీయ ప్రబోధన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులను, యువత ఆలోచనా విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేటి కాలంలో ప్రతీది మొబైల్లోనే నిక్షిప్తమై ఉందన్నారు. నేటి కుటుంబాల్లోనూ పరస్పర సంభాషణలు తగ్గిపోతున్నా యని మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలతో మరింత ఆప్యాయంగా మెలగాలని, వారి కోసం సమయం కేటాయించి మాట్లాడాలని ఆయన హితవు పలికారు. ప్రస్తుతం కొత్తతరం ప్రతి అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని, వారికి కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా తగిన కారణాలను వివరించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని అభిప్రాయపడ్డారు. 'మేము యువకులుగా ఉన్నప్పుడు విధేయత చూపించే వాళ్లం. కానీ ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. నేటి తరం ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉంది. కాబట్టి మనం వారికి ప్రతి విషయాన్ని కారణాలతో సహా వివరించాల్సి ఉంటుందన్నారు. యువత నమ్మకాన్ని గెలవాలంటే హుకుం జారీ చేయడం కాదు, వారితో మాట్లాడాలి. వారికి ఓ ఆత్మీయ భావన కలిగించాలి. ఆదేశాలు జారీ చేయడం కాకుండా చర్చలు జరిపి, ఒక ఏకాభిప్రాయానికి రావడం ముఖ్యమని భగవత్ పిలుపునిచ్చారు.

### కొత్త సాంకేతికతపై పట్టు సాధించాలి

విదేశీ దండయాత్రలు, బ్రిటీష్ పాలన వల్ల భారత ప్రజల ఆలోచనా ధోరణి పూర్తిగా మారిపోయిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అన్నారు. బ్రిటీష్ పాలన వల్ల మన సాంప్రదాయాలు తప్పని, విదేశీ పద్ధతులే సరైనవనే భావన భారతీయుల్లో పెరిగిందని వ్యాఖ్యానించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానానికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. టెక్నాలజీని మానవాళి శ్రేయస్సు కోసం వాడుకోవాలని సూచించారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల గురించి భగవత్ ప్రత్యక్షంగా ఎలాంటి ప్రస్తావన చేయకపోయినప్పటికీ, ప్ర స్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆయన వ్యాఖ్య లు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'మోహన్ భగవత్ గారు, జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న పరిణామాలపై మీరు పాటిస్తున్న మౌనం మీ స్పీచులకంటే శక్తివంతంగా ఉంది' అని విమర్శించారు.

# దేశ విద్యావ్యవస్థ.. ఆర్ఎస్ఎస్ చెరలో!

(మొదటి పేజీ తరువాయి)

ఉందని రాహుల్ ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉందని, విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని కోరుకుంటుందన్నారు. శనివారం సా యంత్రం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయంగా పేర్కొన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై హింస, పెల్లెట్‌గన్‌ల ప్రయోగం వంటి ఘటనలు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశంతోనే జరిగాయని, అందుకు ఆయనే బాధ్యులని ఆరోపించారు. దేశ భవిష్యత్తు గా ఉన్న విద్యార్థులపై మన బలగాలే కాల్పులు జరపడాన్ని అంగీకరించబోమని రాహుల్ తేల్చిచెప్పారు. విద్యార్థులపై అణిచివేతపై, అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని తెలిపారు. ప్రధాన్ రాజీనా మా.. అవినీతికి, విద్యా వ్యవస్థ విధ్వంసా నికి ప్రతీక అని, ఆయన తప్పుకోవడం మం చిదేనన్నారు. విద్యార్థుల డిమాండ్లు ఇంకా పూర్తిగా నెరవేరలేదన్నారు. విద్యార్థులపై దాడిచేసిన వ్యక్తులు, అమలుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఇది భారత విద్యార్థుల నుంచి, ప్రతిపక్షం నుంచి వస్తున్న వార్నింగ్. ఇప్పటి వర కు మీరు దేశాన్ని నడిపిన తీరులోనే ఇకపై నడపలేరు. ఇది మీ వ్యక్తిగత అంశం కాదు. ఇది మీ సొంత ఆస్తి కాదు. ఈ దేశం భారత ప్రజలది. భారత రాజ్యాంగానిది' అని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులకు రాహుల్ అభినందనలు తెలిపారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థుల విజయం మోదీ సర్కార్‌కు మేలుకొలుపు అని, భారతీయ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇకనైనా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షల వ్యవస్థలో మా ర్పులు చేస్తూ తీసుకొచ్చే బిల్లులపై విపక్షాల తో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. దేశంలో ఉద్యోగాల సృష్టి, విద్యా వ్యవస్థ, సంస్థలు, మీడియా వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. దీనివల్ల ఆర్థిక సంక్షోభం తలెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు



# జెన్-జీ జ్వాల కార్చిచ్చు కారాదనే!

### ప్రధాన్ రాజీనామాకు కేంద్రం అంగీకారం

దిల్లీ: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై మొదలైన విద్యార్థుల నిరసనను తొలుత అంతగా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం.. ఉద్యమకారుల డిమాండ్లు అన్నింటికీ అంగీకరించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గత పన్నెండేళ్ల పాలనలో పలు అంశాలపై దృఢ వైఖరిని ప్రదర్శించిన మోదీ సర్కారు.. విద్యార్థుల విషయంలో వెనక్కి తగ్గడానికి కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. పొరుగు దేశాలైన నేపాల్ (2025), బంగ్లాదేశ్ (2024), శ్రీలంక(2022)లలో ఉవ్వెత్తున ఎగసిన జెన్ జీ ఉద్యమాలు, వాటి పర్యవసానాలూ ప్రభుత్వ పెద్దలకు వ్యూహకర్తలు గుర్తు చేసి ఉంటారనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. మన యువత ఆగ్రహం దావానలంలా మారి దేశమంతటికీ వ్యాపించరాదనే ఉద్దేశంతోనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కేంద్ర ప్రభుత్వం రాజీనామా చేయించి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇవేకాకుండా పలు ఇతర అంశాలు ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని ఆలోచనలో పడేశాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) యువత ఆకాంక్షలతో అనుసంధానమై వ్యవస్థల వైఫల్యాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టడం నవతరాన్ని ఆకట్టుకొంది. అది రోజురోజుకూ విస్తృతమైంది. యువతలో వస్తున్న భారీ స్పందనను గుర్తించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జూన్ 20న దిల్లీలోని జంతర్ మంతర్‌లో ఆందోళనకు దిగారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు మద్దతు పలకడం మరింత ధైర్యాన్నిచ్చింది. ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించడం ప్రారంభించారు. సీజేపీ ఉద్యమంపట్ల మొదట్లో ఉదాశీనత ప్రదర్శిస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వం.. జంతర్ మంతర్‌లో జరిగే మిగతా ఉద్యమాల్లాంటిదే ఇదీ అని తేలిగ్గా తీసుకుంది. నిరశనకు దిగిన సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఉద్యమం చల్లబడుతుందన్న అంచనా తప్పింది. ఈ నెల 20న వేల మంది ఆందోళనకారులు పార్లమెంటు ముట్టడికి స్వచ్ఛందంగా కదిలిరావడం, దీనిని అడ్డుకోవడానికి పోలీసులు, భద్రతా బలగాలు చేసిన ప్రయత్నాలు ఉద్రిక్తతలను మరింత పెంచాయి. దేశవ్యాప్తంగా విద్యార్థులపట్ల సానుభూతి పెల్లుబికేలా చేశాయి. ఇది కేంద్ర ప్రభుత్వాన్ని ఆత్మ రక్షణలోకి నెట్టింది.ఆందోళనకారుల అరెస్టుకు జాతీయ భద్రతా చట్టం కింద అనుమతులివ్వడం ప్రభుత్వంపై మరింత ఆగ్రహాన్ని రాజేసింది. జంతర్ మంతర్ ఉద్యమానికి మద్దతుగా దేశంలోని విభిన్న ప్రాంతాల్లో విద్యార్థులు వీధుల్లోకి రావడం ప్రారంభమైంది. కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ... ప్రధాని మోదీ ఇంటి సమీపంలో మెరుపు ధర్నా చేపట్టడం, పోలీసుల అరెస్టులు తీవ్ర చర్చకు దారితీశాయి. పార్లమెంటు లోపల ప్రతిపక్షాలు, వెలుపల జంతర్‌మంతర్‌లో విద్యార్థులు, యువత ఉద్యమంతో పాలకపక్షానికి ఊపిరాడని పరిస్థితి నెలకొంది. దీంతో వ్యూహం మార్చిన ప్రధాని మోదీ చకచకా పావులు కదిపారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటును ప్రకటించడంతోపాటు క్యాబినెట్‌లోనూ ఆమోదింపజేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌తో ఆమరణ దీక్షను విరమింపజేసినా విద్యార్థులు వెనక్కి తగ్గకపోవడం, ప్రజల్లోకి వెళ్లడానికి రాహుల్ గాంధీకి అవకాశం దొరుకుతోందని భావించిన ప్రభుత్వం ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించి వివాదానికి తెరదించాలని భావించింది. విద్యార్థుల ఆందోళనలు ఇలాగే సాగితే 2027 తొలి నెలల్లో జరిగే ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, గోవా, మణిపుర్, ఉత్తరాఖండ్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం పడుతుందని భావించింది. రామజన్మభూమి విరాళాల చోరీ అంశంపై ఇప్పటికే ఆత్మరక్షణలో ఉన్న ప్రభుత్వానికి ప్రస్తుత పరిణామాలు మరింత ఆందోళన కలిగించాయి.



# ఆందోళనల విరమణ

(మొదటి పేజీ తరువాయి)

ఫలవంతమయ్యాక సీజేపీ ప్రతినిధులు ఈ విషయాన్ని మంత్రులతో కలిసి సంయుక్త మీడియా ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో కలిసి శనివారం ఢిల్లీలోని 'కాన్సిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా'లో సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశు తోష్ రంకాలు సమావేశమై చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో అశుతోష్ మాట్లాడారు. "బాధిత కుటుంబాలకు గౌరవప్రదమైన ఆర్థిక సాయంతోపాటు ఢిల్లీ, బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఉద్యమకారులపై నమోదైన కేసులను నాలుగు రోజుల్లోపు ఎత్తేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. దీంతో నిరసనలకు నేటితో ముగింపు పలుకుతున్నాం.

జంతర్‌మంతర్ సహా అన్ని నిరసనవేదికల నుంచి కార్యకర్తలంతా ఇళ్లకు బయల్దేరండి"అని అశుతోష్ కోరారు. హామీల అమలు, విద్యావ్యవస్థ పటిష్టతకు తీసుకునే చర్యలపై సమీక్ష కోసం సీజేపీ, ప్రభుత్వ ప్రతినిధులు నాలుగు వారాల తర్వాత మళ్లీ భేటీ అవుతారని అశుతోష్ వెల్లడించారు. తర్వాత జేపీ నడ్డా మాట్లాడారు. "ఉద్యమం ముగిశాక కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడవద్దు అని సీజేపీ ప్రతినిధులు కోరారు. మంత్రి రాజీనామా, బాధితులకు నష్టపరిహారం, కేసుల ఉపసంహరణతోపాటు పరీక్షల నిర్వహణ, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు వాళ్లు సూచించిన ఐదు పాయింట్ల చార్టర్‌ను పరిశీలించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తంచేసింది"అని నడ్డా తెలిపారు.



# ఇల్లందులో నూతన గాయత్రి పాలు పాలపదార్థాల కేంద్రం ప్రారంభం


**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) జులై 25**

ఇల్లందు మున్సిపాలిటీ 16వ వార్డులో సాయిబాబా గుడి ఎదురుగా ఏర్పుల సంతోష్ -- గాయత్రి దంపతులు నూతనంగా గాయత్రి పాలు మరియు పాలపదార్థాల కేంద్రం ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మున్సిపల్ కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి సతీష్ హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన పాల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పుల సంతోష్, గాయత్రి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి సతీష్ శాలువాలతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లా సూర్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ వీరభద్రం, పట్టణ మాజీ అధ్యక్షులు డానియల్, సతీష్, వీరేందర్, ఉదయ్, అలాగే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాల కేంద్రం నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జగిత్యాల లో ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు.

## పలు ఆలయాల్లో బారులు తీరిన జనం...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జులై 25.**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో శనివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. జగిత్యాల శ్రీ గుట్ట రాజేశ్వర స్వామి ఆలయ సమీపంలో నెలకొన్న శ్రీ లక్ష్మీ గోదాదేవి సహిత వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, భజన, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. ఆలయ పక్షాన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాంసాని మహేష్, పడకండి శ్రీనివాస్, సురేష్, శ్రీకాంత్, భూమయ్య, రాజు పాల్గొన్నారు.

# నర్సింగ్ రావు పల్లి లో రేషన్ ఈ - కేవైసీ ప్రక్రియ వేగవంతం

**నిజాంసాగర్ /జులై 25( ప్రజాతీర్పు ):**



నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లిలో రేషన్ కార్డుదారులకు ఈ–కేవైసీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. అర్హులైన లబ్ధిదారులు తమ ఆధార్, రేషన్ కార్డు వివరాలతో గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి వచ్చి ఈ–కేవైసీ పూర్తి చేసుకుంటున్నారు. గడువులోగా తప్పనిసరిగా ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# రైతుల సుభిక్షం కోసం కొండగట్టు అంజన్నను ప్రార్థించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

- వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలి
- రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం కోసం ప్రత్యేక పూజలులి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జులై 25.**



తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పర్యటనలో భాగంగా కొండగట్టు హరిత హోటల్‌కు చేరుకున్న చైర్మన్‌కు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదుపరి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న చైర్మన్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా స్వాగతం పలికి ఆశీర్వచనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు బాగా పండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు దీక్షలు తీసుకుని కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడం ఈ క్షేత్రం ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, డీఎస్పీ రాములు , ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, ప్రవీణ్, నీలాదేవి, రాంబాబు, శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కిషోర్, డి.పి.ఆర్.ఆర్. వి.శ్రీధర్, తాశీల్దార్, ఈఓ అంజనా రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు,ఆలయ అధికారులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అమీన్పూర్ లో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యత

**పటాన్ చేరు, జూలై 25 (ప్రజాతీర్పు ప్రతినిధి )**

అమీన్పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు శనివారం అమీన్పూర్ డివిజన్‌లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు అమీన్పూర్‌లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్‌లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్పూర్‌ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొని.. తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. స్థానికంగా నమోదు చేసుకునే ప్రతి ఓటు అభివృద్ధికి పునాది లాంటిదని తెలిపారు. పటాన్ చేరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చంద్రకళ గోపాల్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, జగదీష్, రాజు, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# అమీన్పూర్ లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

## అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనాలని విజ్ఞప్తి..

**పటాన్ చేరు, జూలై 25 (ప్రజాతీర్పు ప్రతినిధి )**

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ( ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ) లో అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలు సమర్పించి పటాన్చెరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను శనివారం ఉదయం ఆయన స్వయంగా పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. సాఫ్ట్ వేర్, ఫార్మా ఉద్యోగులు అధికంగా నివసించే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెంట్లు, కాలనీలలోఎస్ఐఆర్ ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జులై 25 వ తేదీ వరకు 59 శాతం మాత్రమే నమోదు కావడం జరిగిందని.. మరో 20 శాతం వరకు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఓటు హక్కు అత్యంత కీలకమని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించడంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ప్రచార వాహనాలు, సోషల్ మీడియా ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు మహాదేవ రెడ్డి, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, చంద్రశేఖర్, దాసు, జగదీష్, అధికారులు మనోహర్, నరసింహా, అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# అన్న మాట నిలబెట్టుకున్న బేగావత్ తండ యువ సర్పంచ్ బేగావత్ సంతోష్ కుమార్...

- బేగావత్ తండా లో సి సి రోడ్డు ను ప్రారంభించిన అంబటి వీరభద్రం గౌడ్...
- ఇంకా ఏన్నో అభివృద్ధి పనులు చేయ్యాలని యువ సర్పంచ్ కు సూచన...

**కురవి జులై 25(ప్రజా తీర్పు విలేఖరి)**

కురవి మండలం లోని బేగావత్ తండా లో అభివృద్ధి పనులకై డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్ సహకారం తో కురవి మండలం లోని బేగావత్ తండా కు సి సి రోడ్డు మంజూరు అయ్యినందున స్థానిక సర్పంచ్ బేగావత్ సంతోష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సి సి రోడ్డు ను ప్రారంభించడం జరిగింది.ఇలాగే అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేపట్టాలని తండా ప్రజలు కోరుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు స్థానిక ఉపసర్పంచ్ అడానియా సుమన్, మోదుగుల గూడెం గ్రామ సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్,ఉపసర్పంచ్ దయ్యాల శ్రీధర్ గౌడ్,బేగావత్ తండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బేగావత్ నవీన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు గొల్లపల్లి రజనీకాంత్,వార్డు సభ్యురాలు బేగావత్ మంగమ్మ, మాజీ ఎంపీటీసీ బేగావత్ బాలాజీ నాయక్, బాలాజీ (తండ్రి) కోట్యా నాయక్,బేగావత్ శంకర్,జర్పుల లింగ్యా, విజేందర్ (తండ్రి) రామోజీ, మోహన్ (తండ్రి) దేవోజీ, తదితరులు పాల్గొన్నారు.







# జగిత్యాల పోలీసుల పనితీరుకు డీఐజీ ప్రశంసలు

- జగిత్యాల జిల్లా పర్యటనలో బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 25.**



బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్, శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం (డీపీఓ)తో పాటు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా పోలీస్ గెస్ట్ హౌస్ కి చేరుకున్న డీఐజీకి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ గారు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాస్త్రీయ ఆధారాలతో కేసులను విచారించి కోర్టుల్లో శిక్షల శాతం పెంచే విధంగా పనిచేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భం గా పోలీస్ స్టేషన్ ఆవరణం లో మొక్కను నాట్టారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న డీఐజీ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న వివిధ విభాగాలను సందర్శించారు. ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో కార్యాలయాలను పరిశీలించి నిర్వహిస్తున్న రికార్డులు, డిజిటల్ డేటా నిర్వహణ, సమాచార సేకరణ విధానం, సాంకేతిక వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ద్వారా జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించిన సమాచార సేకరణ, ముందస్తు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే అసత్య ప్రచారాలు, వదంతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటిపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఐటీ కోర్ విభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల ఛేదనలో సాధిస్తున్న పురోగతిని తెలుసుకున్నారు. సీసీటీవీ విశ్లేషణ, డిజిటల్ ఆధారాల సేకరణ, డేటా అనాలిసిస్, సైబర్ నేరాల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. డీసీఆర్‌బీ కార్యాలయంలో నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, వారెంట్‌లు, నిందితుల వివరాలు, నేర విశ్లేషణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రతి రికార్డు నవీకరించబడేలా చర్యలు తీసుకోవాలని, డేటా ఖచ్చితత్వాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని డీఐజీ ఆర్. భాస్కరన్, ప్రత్యేకంగా అభినందించారు. డీఐజీ వెంట జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,, అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సీఐలు, ఎస్.ఐ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## గడ్డపోతారం జిఎంఆర్ కాలనీలో ఉచిత రొమ్ము క్యాన్సర్ అవగాహన, వైద్య శిబిరం

- ప్రారంభించిన కౌన్సిలర్ గండి స్వప్న కుమార్ యాదవ్

**పటాన్ చేరు, జూలై 25 (ప్రజాతీర్పు ప్రతినిధి )**

మహిళలు ప్రతి ఒక్కరూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు పరీక్షల ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ప్రజ్ఞా చిగురుపాటి అన్నారు. శనివారం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని జిఎంఆర్ కాలనీ మరియు జర్నలిస్ట్ కాలనీలో 6వ వార్డు కౌన్సిలర్ గండి స్వప్న కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ అవగాహన మరియు వైద్య పరీక్షల శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది (గ్రానూల్స్ ఏఐజి ) మరియు యుసి బ్రెస్ట్ ఫౌండేషన్, సంయుక్త సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరానికి మహిళల నుండి విశేష స్పందన లభించింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా గణేష్ , కౌన్సిలర్ ఆకుల మమత నవీన్, కుమార్, హాజరై శిబిరాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా శిబిరాన్ని నిర్వహించిన 6వ వార్డు కౌన్సిలర్ గండి స్వప్న కుమార్ యాదవ్‌ను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞా చిగురుపాటి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే వంద శాతం నయం చేయవచ్చని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వీడి, క్రమం తప్పకుండా స్వీయ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక శిబిరంలో సుమారు 100 మంది మహిళలకు అత్యాధునిక పరికరాలతో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు వెల్లడించారు. వార్డు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ శిబిరాన్ని విజయవంతం చేసినందుకు కాలనీ వాసులు కౌన్సిలర్ గండి స్వప్న కుమార్ యాదవ్‌కు మరియు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో డబల్ బెడ్ రూమ్‌ల డ్రా కలగానే మిగిలిపోయింది

- లక్కీ డ్రా తీసి మూడు నెలలు అవుతున్నా కూడా పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు
- డబుల్ బెడ్ రూమ్ డ్రాలో వెల్లిన అర్హులందరికీ వెంటనే డబల్ బెడ్ రూముల తాళాలు అందజేయాలి
- ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 25**

ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం కట్టించిన డబల్ బెడ్ రూమ్ లను మంచిర్యాల జిల్లా కలెక్టర్ సమక్షంలో అట్టహాసంగా డబల్ బెడ్ రూమ్ లను లక్కీ డ్రా పద్ధతిలో నిర్వహించడం జరిగింది ఆ యొక్క లక్కీ డ్రా లో వెల్లిన వారికి వెంటనే అందజేస్తామని చెప్పి ఇంతవరకు కూడా డబల్ బెడ్ రూమ్ లక్కీ డ్రాలో అర్హులైన వారికి ఇంతవరకు ఇవ్వకపోవడం చాలా సిగ్గుచేటు కొంతమంది డబుల్ బెడ్ రూమ్ లో లక్కీ డ్రా లో వెల్లిన అర్హులు అయోమయంలో పడి మాకు డ్రాలో వెల్లిన డబల్ బెడ్ రూంలు మా చేతికి అందుతాయో లేదోనని ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం చాలా దారుణం ఇప్పటికైనా సంబంధిత కలెక్టర్ గారు స్పందించి డబల్ బెడ్ రూమ్ ల లక్కీ డ్రా లో డ్రా వెల్లిన ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ లు అందించాలని ఎం సిపిఐయు పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం లేనియెడల డబల్ బెడ్ రూమ్ ల లక్కీ డ్రా లో వెల్లిన ప్రతి ఒక్కరిని సమన్వయపరిచి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో,తోగరి రాహుల్,ఆకాష్, పాల్గొన్నారు



## రైతు బజార్‌లో అక్రమ వసూళ్లపై రైతుల ఆగ్రహం... కమిషనర్, మేయర్‌కు వినతి

- రైతు బజార్‌లో రైతులకు రక్షణ కల్పించాలి... కొత్తగూడెం కార్పొరేషన్‌ను ఆశ్రయించిన రైతులు

**భద్రాద్రి కొత్తగూడెం , జూలై 25 (ప్రజా తీర్పు)**

కొత్తగూడెం: రైతు బజార్‌లో రైతుల నుంచి బస్తాకు ?30 చొప్పున వసూలు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ సుజాతనగర్ మండలానికి చెందిన పలువురు కూరగాయల రైతులు శనివారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాతను, అనంతరం మేయర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం రైతులు నేరుగా వినియోగదారులకు తమ పంటలను విక్రయించుకునేందుకు ఏర్పాటు చేసిన రైతు బజార్‌లో కొందరు వ్యక్తులు అధికారిక రసీదులు ఇవ్వకుండా బలవంతంగా నగదు వసూలు చేస్తున్నారని, దీంతో చిన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజార్‌లో పారదర్శక వ్యవస్థను అమలు చేసి, ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు రక్షణ కల్పించి ఎలాంటి ఆటంకాలు లేకుండా తమ పంటలను విక్రయించుకునే వాతావరణం కల్పించాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సుజాత రైతులు ప్రస్తావించిన అంశాలపై సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలు వెలుగులోకి వచ్చిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రైతులు కొత్తగూడెం మేయర్‌ను కలిసి సమస్యను వివరించారు. రైతుల పట్ల ఎలాంటి అన్యాయం జరిగినా సహించబోమని, ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై చట్టపరంగా విచారణ జరిపించి అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. రైతు బజార్ రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వేదిక అని, అక్కడ రైతులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు చోటుచేసుకోకుండా కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా నడికట్టు రోసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు బచ్చలకూర శ్రీనివాస్, నడికట్టు రాజశేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రైతు బజార్ కూరగాయల వ్యాపారుల సంఘం సభ్యులు, పలువురు కూరగాయల రైతులు పాల్గొన్నారు.



## సుంకిశాల సంపత్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ జూలై 25 (ప్రజాతీర్పు)**

బీఆర్ఎస్ నాయకుడు సుంకిశాల సంపత్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సంపత్‌రావుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, సుంకిశాల సంపత్‌రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరింత చురుకైన పాత్ర పోషిస్తూ రాజకీయ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా అభినందనలు, ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంపత్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## మాసాయిపేట మండల కేంద్రంలో ఎస్ ఐ ఆర్ 100 శాతం పూర్తి బిఎల్‌ఓ లను అభినందించిన ఆవుల రాజిరెడ్డి

**( పంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట ) జులై 25**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి నర్సాపూర్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి తో కలిసి పర్యటించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసినందుకు బిఎల్ఓ పద్మ, స్వర్ణలత, రేణుక, స్వప్న, శోభ రాణి లను ఈ సందర్భంగా అభినందించారు. ఆవుల రాజు రెడ్డి మాట్లాడుతూ తన స్వగ్రామమైన మాసాయిపేట లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగంగా పూర్తిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఒక ఓటు తప్పిపోకుండా చూడాలని పక్క ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు ఏ ఒక్కరి ఓటు తప్పిపోకుండా చూడాలని గ్రామ సర్పంచులకు, బిఎల్ఓ లకు విజ్ఞప్తి చేశారు ఎవరివైనా ఓటు పత్రాలు రాకుంటే ఇంకా ఆన్లైన్లో అప్లై చేసుకోవచ్చు రానివారు బిఎల్ఓ లను సంప్రదించాలని నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి, పాలకవర్గం వార్డ్ మెంబర్స్, కాంగ్రెస్ పార్టీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బూత్ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

# మంత్రి అడ్లూరికి కీలక బాధ్యత..

- ఎస్సీ వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లుపై కీలక కమిటీల్లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్థానం..
- సామాజిక న్యాయం -- సమాన అవకాశాల దిశగా సీఎం రేవంత్ రెడ్డి మరో ముందడుగు..
- అణగారిన వర్గాల స్వరం ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రతిధ్వనించేలా కీలక బాధ్యతలు..

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై25**



తెలంగాణలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని రెండు అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.1077ను ప్రభుత్వం జారీ చేసింది. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింత బలం చేకూర్చనుంది. అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారంగా వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొందిస్తున్న రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు--2026లి" కు సంబంధించిన శాసన రూపకల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి సభ్యత్వం కల్పించింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన, న్యాయసమ్మతమైన సిఫారసులు అందించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎలాంటి వివక్షకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును ఆదర్శవంతమైన శాసనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల అమలుకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆ దిశలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయం తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతుందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ రెండు కీలక కమిటీలలో సభ్యత్వం కల్పించడం ద్వారా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర మరింత బలోపేతం కానుంది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయం సాధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి అభిప్రాయపడ్డారు.



## ఎం జే పీ పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి డిప్యూటీ వార్డెన్ సుజాతల సస్పెన్షన్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 25**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి డిప్యూటీ వార్డెన్ సుజాతలు సస్పెన్షన్ కు గురయ్యారు ఇటీవల ఫుడ్ పైజన్ తో 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనకు బాధ్యుల చేస్తూ, వీరి నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని పేర్కొంటూ రాష్ట్ర ఎం జె పి పాఠశాలల సెక్రెటరీ సైదులు ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎం జేపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ఎస్ శ్రీధర్ తెలిపారు.



## బాసని నాగేశ్వరాని పరామర్శించిన ఇల్లందు టిడిపి నేతలు

**(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) జులై 25.**

ఇల్లందు :గత నెల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స తీసుకొని ఇంటికి చేరుకున్న ఇల్లందు పట్టణం ఒకటో వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు భాసని నాగేశ్వరావుని స్థానిక టిడిపి నేతలు ఇల్లందు నియోజకవర్గం కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో పాలు, పండ్లు తీసుకొని వెళ్లి పరామర్శించారుఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ నాగేశ్వరరావు యోగక్షేమాలు తెలుసుకొని ఆరోగ్యం బాగా చూసుకోవాలని పూర్తిగా కోల్కున్న తర్వాత నారా చంద్రబాబు నాయుడు దగ్గరికి తీసుకెళ్తానని వారికి వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పారు, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, జాతీయ పార్టీఅధ్యక్షులుచంద్రబాబునాయుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, జాతీయ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మీ ఆరోగ్యం పై ఎప్పటికప్పుడు సంప్రదించి తెలుసుకున్నారని, మీతో స్వయంగా చంద్రబాబు నాయుడు మాట్లాడారని అలాగే తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ కూడా ఇప్పటికే మిమ్మల్ని హాస్పిటల్ కు వచ్చి మీమల్ని చూసారని,పార్టీ మీకు మీ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు పార్టీ సభ్యత్వం కలిగినందున సంబంధిత ఇన్సూరెన్స్ వర్తిస్తుంది అని రాష్ట్ర పార్టీ తో సంప్రదించి అందిస్తామని తెలిపారు. బాసని నాగేశ్వరరావు మాట్లాడుతూ ముద్రగడ వంశీ కి యాక్సిడెంట్ విషయం తెలిసిన వెంటనే పార్టీకి సమాచారం అందించి, నన్ను ఆదుకున్నందుకు, అండగా నిలబడ్డందుకు వంశకి అలాగే తనతో మాట్లాడినందుకు చంద్రబాబు నాయుడు ఆరోగ్యం ఎప్పటికప్పుడు తెలుసుకున్న లోకేష్ రాష్ట్ర పార్టీ నాయకులకు, అలాగే ఖమ్మం నాయకులు కేతినేని హరీష్, సర్పంచ్ రమేష్ బాబు కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు,పార్టీ సీనియర్ నాయకులు శ్యామ్ తీవరి, కారు నర్సన్న, వేమూరి సల్మాన్ రాజ్, చెలిమేలా బాబు, ఉన్నాం భాస్కర్, కోపేలి రవి, రేసు అంజి, దాసరి గోపాలకృష్ణ, గోగేలా రాజేష్, ముక్కు శ్రీవెద్, కామ ప్రణయ్,మినుగు రాజు,శివకృష్ణ, రెంటల మహేష్, బాసాని నవీన్, భాస్కర్ తదితరులు



## పార్టీ బలోపేతంపై ఎంపీతో కాంగ్రెస్ నేతల చర్చ..

**నిజాంసాగర్ /జులై 25( ప్రజా తీర్పు ):**

జూబ్లీహిల్స్‌లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ బాలరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాశ్ రెడ్డి, జయప్రదీప్, ఓబీసీ కన్వీనర్ రామలింగం, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, నరేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.



## గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో మంద మకరంద్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 25**

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద్ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపల్ అజ్మీర నరసింహను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని లక్ష్యంతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలనివిద్యార్థులకు సూచించారు. పాఠశాల లో గదుల కొరత ఉందని ఐటీడీఏ పరిధిలో గల వైటీసీ భవనం లో ఈపాఠశాలనునిర్వహిస్తున్నామని సొంత భవనం మంజూరు చేయాలని ప్రిన్సిపల్ పీ వో ను అభ్యర్థించారు. తాత్కాలికంగా వైటీసీ భవనంలోని కొన్ని భవనాలను ఆశ్రమ పాఠశాల కు కేటాయించాలని సంబంధిత వై టీ సీ అధికారి మోహన్ ను పీ వో ఆదేశించారు. బెల్లంపల్లి ఆశ్రమ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్మెంట్ అధికారి ఎస్ సురేష్ ను పిఓ ఆదేశించారు. ఏడవ తరగతి క్లాస్ రూమ్ కి వెళ్ళిన పీవో విద్యార్థులను విద్యాపరమైన విషయాలపై పలు ప్రశ్నలు సంధించారు. విద్యార్థులు వెంట వెంటనే సమాధానాలు చెప్పడంతో పిఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహను అభినందించారు. ఆయన వెంట బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తహసిల్దార్ ఎల్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

## మరికొందరు మంత్రులపై వేటు!

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనోద్యమంతో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. త్వరలో మరికొంతమంది మంత్రులు కూడా క్యాబినెట్ బెర్తులు కోల్పోనున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తున్నది. వచ్చే నెల 13న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగియనున్నాయి. ఆ వెంటనే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ప్రకటన వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రధాని మోదీ సన్నిహితుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఉప ప్రధానిగా పదోన్నతి లభించే అవకాశం ఉన్నదని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. మంత్రివర్గంలో నిర్మలా సీతారామన్, హర్దీప్ సింగ్ పురీ, పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా తదితరులు బెర్తులు కోల్పోవచ్చని సమాచారం.

# దోమల స్వైర విహారం.... విస్తరిస్తున్న వ్యాధులు

- రాత్రి సమయంలో జాగారం చేస్తున్న ప్రజలు.
- పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని ప్రజల విజ్ఞప్తి

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి )జులై 25**



గార్ల. వర్షాకాల సీజనల్ నేపథ్యంలో స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో దోమల స్వైర విహారంతో ప్రజలు వ్యాధుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామ ప్రజలు రాత్రి వేళల్లో దోమల దాడి విపరీతంగా పెరగడంతో రాత్రి సమయాలలో దోమకాటు కారణంగా ప్రజలు జాగారం చేస్తున్నారు, ప్రశాంతంగా ఉండే పరిస్థితి లేదు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోవర్షపు నీరు నిల్వ ఉండడం, మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, అంతరాయం ఏర్పడి చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు వేగంగా విస్తరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాద అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు స్థానిక మేజర్ గ్రామపంచాయతీలో ఫాగింగ్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించడం, దోమల నివారణ మందులను పిచికారీ చేయడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, నిల్వ నీటిని తొలగించడం వంటి చర్యలను తక్షణమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. "ప్రజారోగ్య పరిరక్షణ ప్రాధాన్యత, ప్రభుత్వ ప్రథమ బాధ్యత" అనే దృక్పథంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దోమల నిర్మూలనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మేజర్ గ్రామపంచాయతీ ప్రజలు ప్రభుత్వాన్ని, పంచాయతీ అధికారులను కోరుతున్నారు.



## శ్రీ దుర్గా దేవాలయం ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు వేడుకలు

**కోరుట్ల జూలై 25 (ప్రజాతీర్పు )**

కోరుట్ల పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్‌లో గల శ్రీ దుర్గా దేవాలయం ఆధ్వర్యంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోరింటాకు పెట్టించుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐ ఎమ్ ఏ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ స్వీటి అనూప్ రావు, మున్సిపల్ కౌన్సిలర్ శీలం జయలక్ష్మి, పెండెం స్వాతి హాజరై మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢ మాసంలో నిర్వహించే ఇటువంటి సాంప్రదాయ కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వేడుకలను విజయవంతం చేశారు.

## సీరోల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గా ధీరావత్ వీరన్న నాయక్ ఏన్నిక..

**కురవి/సీరోలు జులై 25(ప్రజా తీర్పు విలేఖరి):**



మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డి సి సి ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోత్ ప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో ఉమ్మడి కురవి మండలంలోని సీరోల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులుగా దీరావత్ వీరన్న నాయక్ కు నియామక పత్రం అందజేయడం జరిగింది.అనంతరం దీరావత్ వీరన్న మాట్లాడుతూ సీరోల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులుగా ఈ అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులకు,డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డా.జాటోత్ రామచంద్రు నాయక్,మహబూబాబాద్ డిసిసి అధ్యక్షులు భూక్యా ఉమా మురళీ నాయక్,వీరి ఆశీస్సులతో నాకు ఇలాంటి అవకాశాన్ని ఇచ్చినందుకు వారికి ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు

### వెల్గటూర్ ఎస్ఐ పి ఉదయ్ కుమార్

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జులై 25**



గౌరవనీయులైన జగిత్యాల జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, జగిత్యాల డీఎస్పీ కె. పురుషోత్తంరెడ్డి గారి సూచనలతో, ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి గారి ఆధ్వర్యంలో, వెల్గటూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ పి. ఉదయ్ కుమార్ నేడు నేర నియంత్రణలో భాగంగా వెల్గటూర్ గ్రామంలో "నేను సైతం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్ గ్రామంలోని వెంకటసాయి ట్రేడర్స్ వారి సహకారంతో దుకాణం ఎదుట రహదారి స్పష్టంగా కనిపించే విధంగా రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి.మాట్లాడుతూ, సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి వ్యాపార సంస్థ, వాణిజ్య సముదాయం మరియు దుకాణ యజమానులు తమ దుకాణాల ఎదుట రహదారులు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంతో పాటు నేరస్థులను త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. పోలీసు శాఖ చేపడుతున్న "నేను సైతం" కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్సై పి ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు.

## ఎస్సీ వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

**మంథని, జూలై-25 (ప్రజాతీర్పు)**



పెద్దపల్లి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్ శనివారం మంథని పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహం, కాలేజీ బాయ్స్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలో ఉంటున్న విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీరు, పరిశుభ్రత, వసతి సౌకర్యాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, బిల్లులతో సహా పలు రికార్డులను పరిశీలించారు. వసతి గృహాల్లో ఎలాంటి లోపాలు లేకుండా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సకాలంలో అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారులు తిరుపతి, రమేష్ లకు తగు సూచనలు చేశారు. నాణ్యమైన ఆహారం, క్రమం తప్పకుండా మెనూ పాటించాలని, విద్యార్థుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం రాకుండా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రవీందర్ సూచించారు.

# భూభారతి భూ రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం రైతులకు అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ నగేష్

- శతాబ్దల గెట్టు పంచాయతీలకు పరిష్కారం కళ్లెం పడనున్న భూ కబ్జాలు .
- హైదరాబాద్ దగ్గరికి మనం పోలే మన దగ్గరికి హైదరాబాద్ వస్తుంది భూమి ధరలు ఆకాశాన్ని అంటనున్నాయి.

**( వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) జూలై 25**



మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని పోతిన్ శెట్టిపల్లి గ్రామంలో సర్పంచ్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం జిల్లాలోని మాసాయిపేట మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,మండల ఇంచార్జ్ తహసిల్దార్ శ్రీకాంత్ తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం పోతంశెట్టిపల్లి గ్రామంలో చెరువు సిఖశీ భూమిని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించి ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తగు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంత్, పాలకవర్గం,ఏడి ల్యాండ్ సర్వే కిషన్, మాసాయిపేట ఇంచార్జ్ తాసిల్దార్ శ్రీకాంత్ ఆర్ఐ ధన్సిగ్, సర్వేయర్ నరసింహులు రెవిన్యూ సిబ్బంది మండల బిజెపి అధ్యక్షుడు,నాగేందర్ రెడ్డి , మాజీ సర్పంచ్ నెల్లూరు, గ్రామ రైతులు, వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం..!!

## ఉస్మానియా క్యాంపస్లో ప్రతిజ్ఞ చేసిన గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సమాఖ్య

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) జూలై 25:**



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన దివ్యాంగుల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న దివ్యాంగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్, స్వయం ఉపాధి అవకాశాలు, అందుబాటులో ఉండే ప్రజా మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం, దివ్యాంగులకు అవసరమైన సహాయక పరికరాల పంపిణీ, ఆరోగ్య సేవలు, గృహాల కేటాయింపు జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ఉద్యోగాలను షాపింగ్ కాంప్లెక్స్ లలో పార్కులలో దివ్యాంగులకు వారి వాటాను ఇవ్వాలని అలాగే వివిధ సమస్యలు, పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని దివ్యాంగులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి హక్కుల సాధన కోసం గ్రేటర్ హైదరాబాద్ సమాఖ్యను మరింత బలోపేతం చేయాలని, త్వరలోనే పూర్తిస్థాయి కమిటీని నిర్ణయిస్తామని నిర్ణయించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో చర్చించి, అవసరమైతే ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయాల దివ్యాంగుల పోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ, దివ్యాంగుల హక్కుల చట్టం--2016ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి దివ్యాంగుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.త్వరలోనే కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి, సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా ముందుకు సాగాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో మొరిగాడి నరసింహ గౌడ్, గొల్ల పాండు యాదవ్, దొరపల్లి ధనమ్మ, కోల రాజ్యలక్ష్మి, మోదాల అరుణ, సైదులు యాదవ్, పి అరవింద్, డి శివ యాదవ్, కే ఇందిరా, మాధవి, స్వప్న, పి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలంలో 101 కిలోల డ్రై గంజాయి స్వాధీనం

## నలుగురు నిందితుల అరెస్ట్ -- కారు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం

**(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు జులై 25)**

భద్రాచలం :పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో భారీగా డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (రానా) ఆధ్వర్యంలో పోలీసులు వీరభద్రం ఫంక్షన్ హాల్ సమీపంలో, కూనవరం రోడ్డుపై నిర్వహించిన తనిఖీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోతుగూడెం ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్న 101 కిలోల డ్రై గంజాయిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబర్ ఖూ-03-చీ=-5892 గల మారుతి ఎర్టిగా కారును, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

**అరెస్టైన నిందితులు:**

1. సలీం పాషా (53), బొమ్మనహళ్లి, బెంగళూరు దక్షిణ, కర్ణాటక.
2. ఈ. రాజేంద్ర ప్రసాద్ (34), నల్లమడ, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. ఎం.డి. అర్బాజ్ హుస్సేన్ (22), బొమ్మనహళ్లి, బెంగళూరు దక్షిణ, కర్ణాటక.
4. ఎస్. గుల్జార్ (35), జయనగర, నెలమంగల, బెంగళూరు గ్రామీణ జిల్లా, కర్ణాటక.

ప్రాథమిక విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోతుగూడెం నుంచి గంజాయిని భద్రాచలం--ఖమ్మం మార్గం గుండా బెంగళూరుకు రోడ్డు మార్గంలో తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ దాడిలో సీఐ రహీమున్నీసా, ఎస్ఐ సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ కరీమ్, పోలీసు సిబ్బంది భద్రం, సీతారాం, రాకేష్, రవి పాల్గొన్నారు.

# 50 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్రం నిషేధం

గత రెండేండ్లలో అశ్లీల కంటెంట్ ప్రసారం చేస్తున్న 50 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. సమాచార సాంకేతిక చట్టం(ఐటీ యాక్ట్), ఇతర నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలను తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ పార్లమెంట్‌కు తెలిపారు. మహిళలు, పిల్లల భద్రత ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, నిషేధించిన ప్లాట్‌ఫామ్‌లు ఐటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత(బీఎస్ఎన్), స్త్రీల అసభ్య చిత్రణ నిషేధ చట్టం-1986 నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించామన్నారు.

# విద్యాశాఖ మంత్రి రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయమే

## ఆకుల స్వామి వివేక్ పటేల్

**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 25 (ప్రజా తీర్పు):**



జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ) సహా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగ యువత సాగించిన ఉద్యమానికి దక్కిన విజయమని జాతీయ బీసీ సంఘం జాతీయ సమన్వయకర్త, జేఎన్‌టీయూ విద్యార్థి సంయుక్త కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరంతర ఆందోళనలు, యువత అలుపెరగని పోరాటం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీల వెనుక ఉన్న అసలు సూత్రధారులను, ముఠాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, మంత్రి రాజీనామాతోనే వ్యవహారాన్ని ముగించరాదని ఆయన డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల కారణంగా పరీక్షలు రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే, జూలై 20న ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ నియామక, ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు పునరావృతం కాకుండా పార్లమెంట్‌లో కఠిన చట్టాన్ని తీసుకురావాలని, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని సూచించారు. దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడే ఏ ప్రభుత్వానికైనా యువశక్తి తగిన సమాధానం చెబుతుందనే విషయాన్ని ఈ పరిణామం స్పష్టం చేసిందని ఆకుల స్వామి వివేక్ పటేల్ అన్నారు. బాధిత విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు జాతీయ బీసీ సంఘం, జేఎన్‌టీయూ విద్యార్థి సంయుక్త కార్యాచరణ సమితి విద్యార్థుల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తాయని స్పష్టం చేశారు.

# ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేట్లకు ఎరువులు విక్రయిస్తే ఫిర్యాదు చేయండి

**హుస్నాబాద్ జులై 25 రవీందర్ ప్రజా తీర్పు**



ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేట్లకు ఎరువులను విక్రయించినట్లయితే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని వ్యవసాయ అధికారి వేల్పుల పూజ అన్నారు. రైతుల నుండి అందిన ఫిర్యాదుల ఆధారంగా, ఎంఆర్‌పీ (గరిష్ట చిల్లర ధర) కంటే అధిక ధరకు యూరియా విక్రయించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ ఎరువుల డీలర్‌కు, మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు, 1985 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం, నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించడం చట్టవిరుద్ధం. ఈ విషయమై డీలర్ తన వివరణను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించారు. సమర్పించే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, సంబంధిత చట్టాల ప్రకారం లైసెన్స్ సస్పెన్షన్/రద్దు సహా తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పేర్కొన్నారు. రైతులు ఎవరైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించినట్లు గమనించినట్లయితే, సంబంధిత ఆధారాలతో వ్యవసాయ అధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# జగిత్యాలలో క్యాండిల్ లైట్ ర్యాలీ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 25.**




నీట్ పరీక్షకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంఘీభావం ప్రకటిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శనివారం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గాజంగి నందయ్య మాట్లాడుతూ, నీట్ విద్యార్థులు గత నెల రోజులుగా కొనసాగిస్తున్న ఆందోళనకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించిందన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు అండగా నిలవాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యులు సహా జాతీయ నాయకత్వం ప్రధాని నివాసం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేతలకు పోలీసుల అడ్డంకులు ఎదురైనా, గాయాలు అయినప్పటికీ విద్యార్థుల భవిష్యత్తు కోసం వెనుకడుగు వేయకుండా పోరాటాన్ని కొనసాగించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాల్గొన్న నాయకులు పలువురు వారి వారి అభిప్రాయాలు చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని క్యాండిళ్లు వెలిగించి నీట్ విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమం లో టిపిసిసి సెక్రటరీ బండ శంకర్,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం, సేవాదల్ కార్యదర్శి బోగోజి ముఖేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

## సర్పంచ్,కాంగ్రెస్ నాయకులు పర్శిక రాజు

**(పగడాల రామారావు ప్రజాతీర్పు బయ్యారం మండల ప్రతినిధి )జూలై 25**

బయ్యారంఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో స్థానిక మండల పరిధి కాచనపల్లి గ్రామపంచాయతీలో ఉన్న కిష్టాపురం గ్రామానికి చెందిన గూగులొాత్ లక్ష్మి కి 34000 రూపాయలు సీఎం రిలీఫ్ చెక్కును అందజెయ్యడం జరిగింది ఈ సందర్భంగా కాచనపల్లి సర్పంచ్ శ్రీమతి శ్రీ యలం రేవతి గారు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పర్శిక రాజు మాట్లాడుతూ ఆర్థిక పరమైన ఇబ్బందులతో గురవుతున్న ప్రతి పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బానోత్ రాంబాబు నునవత్ కిషన్ బానోత్ కిషన్ గూగులోత్ సోమ్లా గూగులోత్ బీమూడు బానోత్ కిషన్ కొట్టం వెంకటేష్ గ్రామ పెద్దలు ఎమ్మెల్యే గారికి కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేంద్రం ముక్కు నేలకు రాయడమే

- డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్
- విద్యార్థి ఉద్యమ విజయానికి దేశవ్యాప్తంగా సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికీ అభినందనలు
- విద్యార్థులు, యువత ఏకమైతే ప్రభుత్వాలు కూడా వెనక్కి తగ్గాల్సిందేనన్న సమతా సైనిక దళ్
- ప్రజా వ్యతిరేక, విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం

**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 25 (ప్రజా తీర్పు):**



జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో వెలుగుచూసిన ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాసంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రజా ఉద్యమాల విజయానికి, విద్యార్థి శక్తికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజిత్ నాయకత్వంలో సాగిన ఉద్యమానికి దేశవ్యాప్తంగా లభించిన మద్దతు ఈ విజయానికి ప్రధాన కారణమని అన్నారు. వివిధ పార్టీల, సంఘాల కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద కార్యకర్తలు, మేధావులు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ కలిసికట్టుగా చేసిన పోరాటమే కేంద్ర ప్రభుత్వాన్ని నిర్ణయం తీసుకునేలా చేసిందని తెలిపారు. ఉద్యమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థులు, యువత ఐక్యంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తే ఎంతటి అధికారంలో ఉన్న ప్రభుత్వమైనా ప్రజల ఆకాంక్షలకు తలవంచక తప్పదని ఈ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడాయని, ఇలాంటి ఘటనలు దేశ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యా రంగంలో అమలు చేస్తున్న విధానాలు పేద, దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్యావకాశాలను పరిమితం చేసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రశ్నపత్రాల లీకేజీల వ్యవహారంపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపించి, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థలో బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు, విద్యా వ్యవస్థలో పారదర్శకత నెలకొనే వరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, విద్యా వ్యతిరేక విధానాలపై సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ స్పష్టం చేశారు. విద్య హక్కును కాపాడడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత అని, యువత భవిష్యత్తుతో రాజీ పడే విధానాలను దేశ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని ఆయన హెచ్చరించారు.



# నెక్లెస్ రోడ్ లో క్యాండిల్ ర్యాలీ లో పాల్గొన్న ఘట్కేసర్ మైనార్టీ కాంగ్రెస్ నాయకులు

**(మొక్క ఉపేందర్ ప్రజా తీర్పు ప్రతినిధి హైదరాబాద్) జూలై, 25:**

పార్టీ ఆదేశానుసారం శనివారం నెక్లెస్ రోడ్ లో జరపతలపెట్టిన కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇర్ఫాన్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం జరిగింది. కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేసినప్పటికీ మిగిలిన పెండింగ్ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ కాజా మోయినుద్దీన్ మాజీ టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం, ఘట్కేసర్ మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడు ఫారుక్ బేగ్, ఘట్కేసర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫీ అద్దిన్, మహమ్మద్ రహమాన్, కమార్, ముక్తార్ అహ్మద్, సోయెబ్, అక్బర్, ఆఫాన్, జహీర్, అల్లా బకాష్,కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితర యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వనమహోత్సవం





- ఏకకాలంలో 1500 మొక్కలు నాటిన పోలీస్.
- కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటిన జిల్లా కలక్టర్ తేజస్ నంద లాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ గార్లు.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 25**

పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి ఏకకాలంలో జిల్లా పోలీసు సిబ్బంది 1500 మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గార్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై, మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో ఏకకాలంలో సామూహికంగా 1500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. చెట్లు, అడవులు పెంచడం వల్ల పర్యావరణ రక్షణకు, సమృద్ధిగా వర్షాలు కురవడానికి ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి, నాటిన ప్రతి ఒక్క మొక్కను మహా వృక్షంలా ఎదిగేలా బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. పోలీసులు అత్యంత ప్రాదాన్యమైన శాంతిభద్రతల విధులతో పాటు సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎల్-నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని నీటి ఎద్దడిని తట్టుకొని పండే పంటలవైపు రైతులు ఆలోచన చేయాలని అన్నారు. జిల్లా యంత్రాంగంలో పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖ అని పోలీస్ శాఖ ఇతర శాఖల సమన్వయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా పనిచేస్తుంది అని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అనేక ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శాంతి భద్రతల రక్షణలో నిరంతరంగా కృషి చేస్తూన్నారు అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా ఎస్పీ కృషి చేస్తున్నారని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ క్యాంటీన్, పరేడ్ గ్రౌండ్, జిమ్ లాంటి వసతులు ఏర్పాటు చేశారని, ఆహ్లాదకరమైన వాతావరణ కల్పన కోసం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది అని తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒకేసారి పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందని వివరించారు. జిల్లా పోలీసు శాఖ అధ్వర్యంలో అన్ని పోలీస్ స్టేషన్ ల పరిధిలో పోలీస్ వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతున్నారు అన్నారు. శాంతి భద్రతల పరరక్షణలో నిరంతరం కృషి చేస్తున్నాము అని తెలిపినారు. చెట్లు పెంచడం అడవులు పెంచడం వల్ల వాతావరణ పరిస్థితులు అనుకూలించి మంచి వర్షపాతం నమోదవుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువగా వర్షపాతం నమోదవుతుందని దీనికి అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటలు రైతులు పండించాలని దీనిపై పోలీస్ శాఖ రైతులకు అవగాహన కల్పిస్తుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మంజు భార్గవి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, రవి, నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డసఆర్బి ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, సిఐ లు రాజశేఖర్, వెంకటయ్య ఆర్ఎస్ఐలు సురేష్, ఎమ్. అశోక్, సాయిరాం, రాజశేఖర్, కె. అశోక్, అన్వర్, అఖిల్, ఎస్ఐ లు యాదవేందర్, మహేష్, మౌనిక, మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు



## గురుకులంలో డెటాల్ తాగిన ఇద్దరు విద్యార్థులు... ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స

- ఆసుపత్రి బెడ్ల మీద విద్యార్థులు..? జూమ్ మీటింగ్ లో ఉపాధ్యాయులు.. ప్రజాసంఘాల పరామర్శ

**మంథని, జూలై-25 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలోని గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల బాలురు లో అనుమానాస్పద స్థితిలో డెటాల్ తాగిన ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకులు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ, సెలైన్ పెట్టి చికిత్స చేస్తున్న విద్యార్థులకు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం జరిగింది మంథని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల బాలుర లో ఏ కారణాల వల్ల విద్యార్థులు డెటాల్ తాగారో తెలియాల్సి ఉండగా విద్యార్థులు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఉండగా సంబంధిత హౌస్ మాస్టర్, హెల్త్ సూపర్వైజర్, యాజమాన్యం, సంబంధిత ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయులు ఉన్నత స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ లో ఉన్నామని చెప్పడం పట్ల ప్రజా సంఘాల నాయకులు అగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మంథని గురుకులంలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయని ఇంకా ఇలాంటి ఘటనలే తిరిగి పునరావృతం కాకుండా ఉండాలని అన్నారు. పరామర్శించిన ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ, గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆహారం, వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బందెల రాజకుమార్ పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: బీజేవైఎం

- రూ.15 వేల కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 25 (ప్రజా తీర్పు):**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేవైఎం పెద్దపల్లి జిల్లా కన్వీనర్ రామగిరి అఖిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలకు సంబంధించి సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుందే గణేష్, రాష్ట్ర ఫీజు రీయింబర్స్‌మెంట్ కన్వీనర్ శరత్ చంద్ర, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకుండా ప్రభుత్వం వెంటనే బకాయిల చెల్లింపుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, మంతెన కృష్ణ, మామిడిశెట్టి రాకేష్, బొల్లం అనిల్, రాజకుమార్, కొమ్ము రాజేందర్, దిలీప్, మధుకరన్, శివసాయి, కుక్క అంజి, కట్ట రోహిత్, అంజి, అనిల్, శ్రీరామ్, కృష్ణ, వినోద్, ఆంజనేయులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుటుంబాన్ని ఆదుకున్న దాతలు

- శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం సేవా కమిటీ

**నర్సంపేట టౌన్ జూలై 25 ప్రజా తీర్పు**



స్థానిక నర్సంపేట పట్టణం యందు ఈరోజు 25 జులై 2026 శనివారం రోజున శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణం యందు ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ ఆధ్వర్యంలో దాతల సహాయంతో రెండు కిడ్నీలు కోల్పోయి జీవితం లో నిరాశగా ఉన్న బిక్షపతి కుటుంబానికి సహకరించి మనోధైర్యం కల్పించారు ఇట్టి కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ యువ నాయకులు డాక్టర్ రాణా ప్రతాపరెడ్డి పాల్గొని బండి సంజయ్ సూచన మేరకు ప్రభుత్వం చే ఉచిత వైద్యం సహకారంలో రెండు కిడ్నీలు కోల్పోయిన వారికి తక్షణమే మెరుగైన వైద్యం కల్పిస్తామని అన్నారు. ఆలయ చైర్మన్ మాధవ శంకర్ మాట్లాడుతూ స్థానిక నర్సంపేట ఎనిమిదవ వార్డు నివాసితులు సట్ల బిక్షపతి గత 15 సంవత్సరాలుగా శుభకార్యాలు ఇతర విందు కార్యక్రమాలలో భోజనం వడ్డన చేస్తూ కొందరి నిరుపేదల వారికి జీవనభృతి కల్పిస్తూ ఆలయంలో కొంతకాలం సేవ కాలంలో గుర్తించి గత నాలుగు నెలలుగా అనారోగ్య పరిస్థితుల్లో రెండు కిడ్నీలు పూర్తిగా పోగొట్టుకొని బాధపడుతున్న బిక్షపతి కుటుంబాన్ని ఆలయానికి తీసుకొచ్చి పలు దాతల సహాయంతో ? ఒక లక్ష 12 వేల రూపాయలు (1,12,000=00) నగదు రూపాయలు సేకరించగా అత్యవసర వైద్యం కి 30 వేల రూపాయలు నగదు చేతికి ఇవ్వగా మిగతా రూపాయలు ముందస్తు వైద్యం లేదా తన పిల్లలు కూతురు శ్రీ మహి కుమారుడు మహధన్ భార్య కల్పన తల్లి ప్రమీలల విద్యా ఆర్థిక ఎదుగుదల నిమిత్తం బ్యాంకులో డిపాజిట్ చేస్తామని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో దాతలు ఆలయం 10 వేల రూపాయలు కమిటీ మరియు ఇతర దాతలు 100 రూపాయల నుండి 5వేల రూపాయల వరకు సహకారం అందించడం జరిగింది . ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నవారు ఆలయ చైర్మన్ సింగరికొండ మాధవ శంకర్ అధ్యక్షులు సైఫా సురేష్ ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి కోశాధికారి దొడ్డ రవీందర్ పెద్దలు కమిటీ సభ్యులు మాదారాపు చంద్రశేఖరం, శ్రీరాం కిరణ్, మోతే సమ్మిరెడ్డి మిడిదొడ్డి బాబురావు మల్యాల రాజు ఆకుల ప్రభాకర్ గిరగాని సాంబయ్య గౌడ్ దయాకర్ ఆలయ మేనేజర్ దేశి రాము తదితరులు పాల్గొన్నారు



## అమెరికాతో ట్రేడ్ డీల్ వద్దు..

అమెరికా-భారత్ ట్రేడ్ డీల్‌ను వ్యతిరేకిస్తూ దేశంలోని అనేక చోట్ల రైతుల నిరసనలు జరుగుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో రైతులు రోడ్డెక్కుతున్నారు. అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు తక్కువగా విధించాలని, భారత్ మార్కెట్‌లో తమ ఉత్పత్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని వాషింగ్టన్ కోరుకుంటున్నదని.. అలా జరిగితే భారత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతు సంఘాల లీడర్లు చెబుతున్నారు. అమెరికా ఉత్పత్తులతో చిన్న, సన్నకారు రైతులు పోటీ పడలేరని అంటున్నారు. పాటియాలా రైతు సంఘం నాయకుడు రమీందర్ సింగ్ మాట్లాడుతూ..'ఒకే బోనులో పులి, మేకను ఉంచితే ఎలా ఉంటుందో ఊహించండి. అమెరికా వ్యవసాయ రంగం పులి లాంటిది. ఇండియా వ్యవసాయం మేక లాంటిది. అందుకే రైతులు ఆందోళన చెందుతున్నారు.

## నీట్ లీక్ వల్ల కొందరు విద్యార్థులకు మేలు



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు దేశ వ్యాప్తంగా నీట్ లీక్ మీద తీవ్ర నిరసనలు జరుగుతుంటే.. ఆమె చేసిన వ్యాఖ్య లు విమర్శలకు దారి తీశాయి. సీతారామన్ మాట్లాడుతూ. . 'నీట్ ఎగ్జామ్ వల్ల లాభపడ్డ కొందరు విద్యార్థులు కూడా ఉన్నారు. రీ ఎగ్జామ్ పెట్టడం కొందరు విద్యార్థులకు బాగా టైమ్ దొరికింది. మొదటి పరీక్షలో సరిగ్గా రాయలేని వారికి సమయం దొరకడంతో బాగా ప్రిపేర్ అయ్యారు. చాలా మంది విద్యార్థులు తన దగ్గరకు వచ్చి రీ ఎగ్జామ్ వల్ల తమకు మంచి జరిగిందని చెప్పారని నిర్మల వెల్లడించారు. నీట్-యూజీ ఆల్ ఇండియా సెకండ్ ర్యాంకర్ పన్షుల్ బన్సల్ తాను నిరసనల్లో పాల్గొనడం కంటే దొరికిన టైమ్‌ను రీఎగ్జామ్ కోసం ప్రిపేర్ అవుతానని నిర్ణయించుకున్నట్టు తెలిపిన తర్వాత.. నిర్మలా ఈ కామెంట్స్ చేశారు. దీంతో నిర్మలపై విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులకు మేలు జరగాలంటే ఇక నుంచి దేశంలోని అన్ని పేపర్లు లీక్ కావాలేమో అంటూ ఎద్దేవా చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలను తక్కువ చేయొద్దని ఆమెకు సూచిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యే లక్ష్యం: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

- సూర్యాపేట జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం
- త్వరలోనే ప్రభుత్వ స్కూళ్లలో 'బ్రేక్‌ఫాస్ట్' పథకం
- పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు విడుదల

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 25**



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తెలంగాణలోనే కాకుండా దేశంలోనే ఉన్నత స్థాయికి ఎదగాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేటలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేను బడిలో ఏడో తరగతికి వచ్చాకే తొలిసారి కంప్యూటర్ చూశాను. కానీ, నేటి డిజిటల్ యుగంలో పుస్తకాల చదువుతో పాటు డిజిటల్ విద్య ఎంతో అవసరం అని ఆయన పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టీ-ఫైబర్, ఏఆర్/వీఆర్ ల్యాబ్స్ ద్వారా ప్రభుత్వ స్కూళ్ల పిల్లలకు గ్లోబల్ స్థాయిలో కోడింగ్ నేర్పిస్తున్నామని చెప్పారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక డిజిటల్ లర్నింగ్ బుక్స్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు.

### పెరుగుతున్న అడ్మిషన్లు.. రూ. 10 లక్షల నిధులు విడుదల

సూర్యాపేట జెడ్పీహెచ్ఎస్‌లో గతేడాది 10వ తరగతి ఫలితాలు బాగుండటంతో పాటు మౌలిక వసతులు మెరుగుపడటంతో ఈ ఏడాది ఏకంగా 121 మంది కొత్త విద్యార్థులు చేరడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ ఒక్క ఏడాదిలోనే 10,113 మంది కొత్తగా ప్రభుత్వ బడుల్లో చేరారని వెల్లడించారు. పాఠశాల అభివృద్ధికి అందరూ పోటీపడి కృషి చేయడాన్ని అభినందిస్తూ.. మౌలిక వసతుల కోసం వెంటనే రూ. 10 లక్షల నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు కలిసి దీనిని జిల్లాలోనే బెస్ట్ స్కూల్'గా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

### త్వరలో బడిలోనే అల్పాహారం

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు, రాబోయే రోజుల్లో ప్రతిరోజూ ఉదయం ఉచిత అల్పహార పథకాన్ని ప్రారంభించ బోతున్నట్లు ప్రకటించారు. ఆరోగ్యకరమైన శరీరం ఉంటేనే చురుకైన మెదడు ఉంటుంది, విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.

### చదువొక్కటే పేదరికాన్ని జయిస్తుంది: టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

పేదరికం పోవాలన్నా, సమాజంలో గౌరవంగా నిలబడాలన్నా చదువొక్కటే ఏకైక మార్గమని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు.

### ప్రతి బడిని కార్పొరేట్‌గా తీర్చిదిద్దుతాం

ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని, ముఖ్యంగా విద్యా రంగానికి ప్రాధాన్యమిస్తూ ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ పడుతున్న శ్రమ అభినందనీయమని కొనియాడారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పాఠశాలను దత్తత తీసుకొని మోడల్ స్కూల్‌గా మారుస్తానని మాట ఇచ్చానని, ఆ దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు.

### డిజిటల్ బోధన.. డ్యూయల్ డెస్క్ బెంచీలు

పాఠశాలలోని విద్యార్థుల కోసం హెచ్‌డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో డ్యూయల్ డెస్క్ బెంచీలు, సొంత నిధులతో వారంలోగా డిజిటల్ బోర్డులు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే సైన్స్ ల్యాబ్, డైనింగ్ హాల్, పాఠశాల బెల్ వంటి వసతులను సైతం త్వరలోనే సమకూరుస్తా మన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యాశాఖ నూతన వరవడితో ముందుకు సాగుతోందని, బడుల్లో సైన్స్ ల్యాబ్‌లు, స్కూల్ బ్యాగులు, డ్రెస్సులు, మౌలిక వసతులను సమర్థవంతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఏఎంసి వైస్ చైర్మన్ జి.శ్రీనివాస్ రావు, మున్సిపల్ కౌన్సిలర్ వెంకన్న, డిఇఓ అశోక్, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ స్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ నిధులు..

## ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ముస్లిం మైనార్టీల ఘన సన్మానం

**సుజాతనగర్, జూలై 25 ( ప్రజా తీర్పు):**



సుజాతనగర్ ప్రాంతానికి చెందిన ముస్లిం మైనార్టీ సభ్యులు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. సుజాతనగర్ ముస్లిం స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ, చాలా సంవత్సరాలుగా స్మశాన వాటికకు బౌండరీ వాల్ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చెత్త, నిర్మాణ వ్యర్థాలు, ఇతర మలినాలను అక్కడ పడేస్తూ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియలు నిర్వహించే సమయంలో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని చెప్పారు. అయితే తమ విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పందించి, బౌండరీ వాల్ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో బౌండరీ వాల్ నిర్మాణం పూర్తయితే స్మశాన వాటికకు రక్షణ లభించడంతో పాటు పరిశుభ్రత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమం పట్ల ఎంపీ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎల్లప్పుడూ ముందుంటున్నారని ముస్లిం మైనార్టీ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, యువకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు పాల్గొని ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.



# ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**నర్సంపేట రూరల్, జూలై 25, ప్రజా తీర్పు ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతిగదులు,గ్రంథాలయం, ప్రయోగశాలలు, హాస్టల్, వంటశాల, ఆస్పత్రి వార్డులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర సౌకర్యాలనుపరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కళాశాల, ఆస్పత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు.నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు బీఎస్సీ నర్సింగ్ కళాశాల, జీఎంసి , నర్సింగ్ కళాశాల నిర్మాణం పనులను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెన్స్ కోసం వెయిటింగ్ షెడ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, విద్యా ప్రమాణాలు, హాస్టల్, భోజన వసతులు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను పరిశీలించి, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులనుయుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, అత్యంత త్వరలో ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. తద్వారా రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులనుఆదేశించారు.ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ (ఇన్‌చార్జ్) డా. ఎస్. లక్ష్మీనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్ (ఇన్‌చార్జ్) డా. ఎం. దామోదారి బాయి, వైస్ ప్రిన్సిపాల్ (అకాడెమిక్స్) డా. కె. శ్రీదేవి, బీఎస్సీ నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, టీఎస్ఎంఐడీసీ (టావీ×ణజ) సివిల్ ఇంజనీర్ నరేష్, విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) వేణు, వైద్యులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఆషాఢంలో ఆచారానికి అద్దం పట్టిన తోటపల్లి

- తోటపల్లిలో ఘనంగా గోరింటాకు వేడుక
- బంక లక్ష్మి చందు
- తోటపల్లి గ్రామ సర్పంచ్

**హుస్నాబాద్, జూలై 25 రవీందర్ ప్రజా తీర్పు**

హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బంక లక్ష్మి చందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. గ్రామ పరిసరాల్లోని తాజా గోరింటాకు ఆకులను సేకరించి, వాటిని సంప్రదాయ పద్ధతిలో రుబ్బి ఒకరికి ఒకరు గోరింటాకు పెట్టుకున్నారు. ఆటలు, పాటలు, జానపద గోరింటాకు గీతాలతో మహిళలు ఆనందోత్సాహాల మధ్య వేడుకలను జరుపుకున్నారు. గ్రామమంతా సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా సందడి నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ బంక లక్ష్మి చందు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తెలుగు సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని అందించడంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుందని, మహిళల ఐక్యత, ఆనందానికి ప్రతీకగా ఈ వేడుకలు నిలుస్తాయని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోలు రాజు, వార్డు సభ్యులు మానుక కుమార్, పోషవేణి కుమార్, శాతవేణి అనూష చందు, బొంగోని రేణుక రమేష్, పోగుల కవిత సత్యం, కొంగరి స్వరూప మల్లేశం, గుల్ల ఎల్లవ్వ లక్ష్మయ్య, అంగన్‌వాడీ టీచర్ గాదాసు విమల, ఆశా వర్కర్ కోతి వెంకటలక్ష్మి, సి.ఏ. వల్లపు రేణుక, వీవో అధ్యక్షురాలు దొంతర వేణి జ్యోతి, పోసవేని రాధికతో పాటు గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో సందడి చేసిన ప్రియాంక మోహన్

# శ్రీశ్రీ స్వరాలాపన



శ్రీశ్రీ స్వరాలాపన వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత ఆయన చేస్తున్న మరో తెలుగు సినిమా 'శ్రీశ్రీ'. పూజా హెగ్డే కథానాయిక. రవి నెలకుదిటి దర్శకుడు. చెరుకూరి సుధాకర్ నిర్మాత. ఇషాన్ సక్సేనా సహ నిర్మాత. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్‌ని ఈ నెల 27న విడుదల చేయనున్నారు. వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత ఆయన చేస్తున్న మరో తెలుగు సినిమా 'శ్రీశ్రీ'. పూజా హెగ్డే కథానాయిక. రవి నెలకుదిటి దర్శకుడు. చెరుకూరి సుధాకర్ నిర్మాత. ఇషాన్ సక్సేనా సహ నిర్మాత. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్‌ని ఈ నెల 27న విడుదల చేయనున్నారు. 'బొమ్మ.. బొమ్మ' అంటూ సాగే ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ని మేకర్స్ శనివారం విడుదల చేశారు. ట్రెక్కింగ్ కాస్ట్యూమ్స్‌లో కొండ ప్రాంతంలోని బ్రిడ్జ్‌పై నడుస్తూ కనిపిస్తున్న దుల్కర్, పూజా హెగ్డేలను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వారి సహజమైన కెమిస్ట్రీ, చిరునవ్వులు పోస్టర్‌కి ఫ్రెష్ ఫీల్‌ని తీసుకొచ్చాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: ఎస్వీఎల్‌వీ సినిమాస్.



## మహేశ్ బాబాయ్ మెచ్చుకున్నారు!

'నాకు చిన్నప్పటి నుంచే సినిమాలంటే ఇష్టం. 16వ ఏటనే నటుణ్ణి కావాలని నిర్ణయించుకున్నా. ముంబయి, పాండిచ్చేరి, న్యూయార్క్ వెళ్లి యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్న అనంతరం కథలు వినడం మొదలుపెట్టాను' అన్నారు జయకృష్ణ ఘట్టమనేని. అగ్ర హీరో మహేష్‌బాబు అన్న కుమారుడైన ఈయన 'శ్రీనివాస మంగాపురం' చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయమవుతున్నారు. అజయ్‌భూపతి దర్శకత్వంలో అశ్వనీదత్ సమర్పణలో పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది.



# ఆగస్టు 15 వరకు రోళ్లవాగు ప్రాజెక్టు షెట్టర్ల ఏర్పాటు

- ఆరు నెలల్లో అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి..
- నక్కల పేట వద్ద మరో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్..
- ధర్మపురి నియోజకవర్గ ఇరిగేషన్ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి..

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )జూలై25**

ఆగస్టు 15వ తేదీ లోపు రోళ్ల వాగు ప్రాజెక్టు షెల్టర్లు ఏర్పాటుచేసి రోళ్ళవాగు ప్రాజెక్టు లో నీటి నిలువ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పై శనివారం హైదరాబాదులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా ఇరువురు మంత్రులు అధికారులతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో నిర్మిస్తున్న రోళ్ళవాగు ప్రాజెక్టు కు షెల్టర్లు బిగించి ఆగస్టు 15వ తేదీ వరకు 0.25 టీఎంసీల నీటిని నిలువ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రోళ్ళవాగు ప్రాజెక్టు కాలువల పూడికతీత పనులకు అంచనాల తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ధర్మపురి మండలంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులు ఆరు నెలల లోపు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2027 జనవరి చివరి కల్లా అక్కపల్లి ఎత్తిపోతల పథకం నుండి రైతులకు నీటిని అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలంలోని జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి పనులు, గొల్లపెల్లి మండలంలో యశ్వంత్ రావు పేట, రంగధాముని పల్లి చెరువు ఊడిక తీత పనులకు అంచనాలు తయారు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

### నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించిన మంత్రి అడ్లూరి..

ధర్మపురి మండలంలోని నక్కల పేట గ్రామంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీటిని అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ధర్మపురి మండలంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించడంతో ధర్మపురి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి చేస్తాం.. మంత్రి అడ్లూరి..

ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలో ని రైతులకు కావాల్సిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంతో కమిషన్ల కొరకు మాత్రమే ప్రాజెక్టుల పనులు చేశారని తాము మాత్రం రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతూ పనులు పూర్తి చేయడానికి ముందుకు సాగుతుందని మంత్రి అడ్లూరి తెలిపారు.



# పందుల దొంగతనం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి న పోలీసులు

## రిమాండ్‌కు తరలింపు

**నర్సంపేట రూరల్, జూలై 25, ప్రజా తీర్పు ప్రతినిధి:**

గత నెల జూన్ మొదటి వారంలో వరమ్మ తోట లో ఓర్సు . ముత్తయ్య కి చెందిన 10 పందులు దొంగతనం జరగగా ఈరోజు అట్టి దొంగలను పట్టుకోవడం జరిగింది. పట్టుబడిన వారు: 1. రాయపురి.రాజ్ పున్నం తీ/శీ కాశీబుగ్గ 2. కేతిరి.కార్తీక్ తీ/శీ దేశాయిపేట 3. కూతాడు చందు తీ/శీ నష్కల్ 4. పల్లపు మహేందర్ తీ/శీ సుబేధరి 5. అంగడి కుమార్ తీ/శీ కాజీపేట పరారీ లో ఉన్న వ్యక్తి: 1. నాగరాజు తీ/శీ జనగాం. ఇట్టి దొంగల వద్ద నుండి ఒక మహీంద్ర శఎశ్రీశీ వాహనం , 4 ఫోన్లు, 95000/- నగదు స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించడం జరిగింది. ఇట్టి దొంగతనం కేసు చేధించడం లో ప్రతిభ కనబర్చిన నర్సంపేట ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ూ× అరుణ్, కానిస్టేబుల్ నాగరాజు,రవి లను ూజూ రవీందర్.రెడ్డిఅభినందించడం జరిగింది.

## మెరిసిన ఇషాన్, అభిషేక్.. అయ్యర్ సారథ్యంలో తొలి పొట్టి సిరీస్ కైవసం..!

వరసగా రెండు వైట్‌వాష్‌లను నుంచి తేరుకున్న భారత జట్టు అదిరే ఆటతో టీ20 సిరీస్ పట్టేసింది. జింబాబ్వేను చిత్తుగా ఓడించి మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి భారీ లక్ష?ృన్ని నిర్దేశించిన అయ్యర్ సేన 90 పరుగుల తేడాతో గెలిచింది. 220 పరుగుల ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లను ప్రిన్స్ యాదవ్(2-10), అభిషేక్ శర్మ(3-17)లు బెంబేలెత్తించారు. సమిష్టి వైఫల్యంతో ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన ఆఫ్రికా జట్టు మరో ఓటమి చవిచూసింది. పొట్టి క్రికెట్‌లో మళ్లీ ఫామ్ అందుకున్న భారత జట్టు టీ20 సిరీస్‌ను కొల్లగొట్టింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో గెలిచిన టీమిండియా రెండో టీ20లోనూ జింబాబ్వేను వణికించింది. రికార్డు స్థాయిలో 52వ సారి రెండొందలకు పైగా కొట్టిన భారత్.. ప్రత్యర్థిని పరిమితం చేసింది. టాపార్డర్ విఫలమైనా బ్యాటుతో రెచ్చిపోయిన ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్)లు భారీ స్కోరొందించగా.. అనంతరం ప్రిన్స్ యాదవ్(2-10), అభిషేక్ శర్మ(3-17)లు వికెట్ల వేటతో చెలరేగారు. బ్యాటుతో విఫలమైన అభిషేక్.. మూడు వికెట్లు తీయడంతో జింబాబ్వే 129కే ఆలౌటైంది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020